# పిచ్చిసన్యాసి

అసలే పోలీసాఫీసరు. అందులోనూ ఈ మధ్యే డిఅయిజిగా ప్రమోష నొచ్చింది. పైగా బోలెడు సరదాలూ స్నేహితులూ. అంచేత మా బావ ఇంట్లో వుంటాడో వుండడో అని కబురు తెలియగానే మా వూళ్ళో బయలుదేరి ఎనిమి దయ్యేటప్పటికి వాళ్ళింటికెళ్ళేను. నా అదృష్టం బాగుంది. అప్పుడే యూనిఫారం వేసుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాడు.

"రా అన్నయ్యా! ఏమిటింత పొద్దున్నే వొచ్చేసేవు. అసలిదేనా రావడం" అంటూ పలకరించింది మా చెల్లెలు పద్మ.

"రాత్రే వచ్చి ఏ హోటల్లోనో దిగి ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేస్తూ మా వాళ్ళకి పట్టుబడుంటాడు. నా పేరు చెప్పి బయటపడి మిగతా వాళ్ళకోసం ఇప్పు డొచ్చి వుంటాడు" అన్నాడు మా బావ, తన మొహాన్ని పేపరు మీద నుంచి కుర్చీలో కూర్చుంటున్న నావైపుకు మళ్ళిస్తూ.

"ఊరుకోండి. ఎప్పుడో ఓసారలా అయిందని............ ఎన్నిసార్లు దెప్పి పొడుస్తారూ?" అంటూ నన్ను వెనకేసుకొచ్చింది పద్మ.

"అతననవల్సిన వాడూ, నేను పడవల్సిన వాణ్ణీ. అననీ. ఇంతకీ తన ప్రతాపాన్నిగురించే కదా చెప్పుకుంటున్నాడు. అదేపాటిదో ఇప్పుడు రుజువు చేసుకుంటాడు" అన్నాను.

"అంటే నిజంగా అలాంటి పనిమీదే ఒచ్చేవన్నమాట?" అన్నాడు ప్రశ్నార్థ కంగా నా మొహంకేసి చూస్తూ.

"చాలా సీరియస్ మేటర్ బావా! ఏం చేస్తావో ఎలా చేస్తావో మళ్ళీ నువ్వే చక్రం అడ్డెయ్యాలి. నిన్నరాత్రి సన్యాసిరాజు క్రిష్ణంరాజుని మర్డర్ చేశాడు'' అన్నాను.

"మైగాడ్! అసలెలా జరిగింది? క్రిష్ణంరాజు కేశవగిరిలో వున్నాడు సన్యాసి రామన్న పేటలో వున్నాడు కదా!"

"కీచకవధలాంటిదేదో జరిగుంటుంది. క్రిష్ణంరాజు రామన్నపేటెళ్లాడు. తెల్లారేటప్పటికి సన్యాసిరాజింటి ముందు క్రిష్ణంరాజు తలా - మొండెం వేరువేరుగా పడున్నాయట. 'క్రిష్ణంరాజుని చంపేశాను. నరకాసురుణ్ణి చంపేశాను' అంటూ సన్యాసిరాజు చేతిలో గొడలి పెట్టుకుని అరవడం విని చుట్టుపక్కల వాళ్ళందరూ పోగయ్యేరుట. ఎవడో పోలీస్ స్టేషన్‌లో చెప్పేడు. వాళ్ళొచ్చి వాణ్ణి అరెస్ట్ చేసి లాకప్‌లో పడేసి చితకతన్నేరుట. రామన్నపేట సర్పంచ్ ప్రభాకరం స్కూటరేసుకుని కేశవగిరొచ్చి నాకు చెప్పేడు. వెంటనే బయల్దేరిలా వొచ్చేశాను'' అన్నాను, పద్మ తెచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ.

''ఇన్‌స్పెక్టరెవరు?'' అని అడిగేడు నాలుగైదు నిమిషాల నిశ్శబ్దం తర్వాత.

''యాద్గిరిట'' అన్నాను.

తర్వాత మెంటల్ హాస్పిటల్ సూపర్నెంట్‌కి ఫోన్ చేశాడు. అతను వీల్లేదన్నట్టున్నాడు. బలవంతం మీద కూడా రావటాని కొప్పించేడు.

* * *

క్రిష్ణంరాజు చచ్చేడంటే కేశవగిరి గ్రామస్తులందరూ ముక్కు మీద వేలేసుకున్నా మనస్సులో దీపావళి చేసుకున్నారు. మధ్య వయస్సులో వున్నా పాతికేళ్ల యువకుడిలాగా కనబడ్డాని కెన్నెన్ని వేషాలెయ్యాలో అనీ వేస్తాడు. అతనికి లేని వ్యసనం లేదు, డబ్బుకి పలుకుబడికీ అంతులేదు డూళ్ళో ఎన్నో కుటుంబాలు అతని దౌర్జన్యానికీ కామదాహానికీ ఆహుతై నవ్వులపాలయ్యేయి. అతన్ని కాదన్నవాడెవడూ వూళ్ళో బతకలేడు. అప్పుడప్పుడు చెరువులో తేలిన శవాలన్నీ క్రిష్ణంరాజు నెదిరించినవాళ్ళవే.

కేశవగిరిలోనే వున్న పెద సన్యాసిరాజు, చిన సన్యాసిరాజు అన్నదమ్ములు. మాదీ వాళ్ళదీ పక్కపక్క ఇళ్ళే. నేనూ మా బావా చిన సన్యాసిరాజు బాల్యస్నేహితులం. సన్యాసిరాజు సోదరులిద్దరూ పౌరుషం, ఆత్మాభిమానం, పేరు ప్రతిష్టలూ వున్న రైతు బిడ్డలు. ఇద్దరూ పసిడి ఛాయతోనూ వ్యాయామం వల్ల కండలు తేలిన శరీరాలతోనూ నువ్వా నేనా అన్నట్లుండే భారీ విగ్రహాలు. వాళ్ళ భార్యలు కూడా అందచందాల్లోనూ మంచితనంలోనూ ఒకళ్ళకొకళ్ళు తీసిపోరు. మా వూర్లో ఏం తగాదాలొచ్చినా యిటీవల వాళ్ళిల్లే న్యాయస్థానం. ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా వీళ్ళదే పెత్తనం కష్టనష్టాలొచ్చిన వాళ్ళకి సానుభూతి సహా

యాలు అందజెయ్యడంలో పీళ్ళదే పై చెయ్యి. ఈ పరిస్థితుల సహజ పరిణామమే ఒద్దు మొర్రో అన్నా బలవంతాన్ని పెద సన్యాసిరాజును పంచాయితీ ప్రెసిడెంటుగా నిలబెట్టడం, నెగ్గడం - క్రిష్ణంరాజు నిలబెట్టిన అభ్యర్థి చిత్తుగా ఓడిపోడానికి దారి తీసింది.

క్రిష్ణంరాజు లౌక్యం తెలియని వాడు కాదు. "నువ్వు నిలబడుతున్నట్టు ముందే తెలిస్తే నీకు పోటీ వుండేది కాదు. మనం మనం జ్ఞాతులం. నీకు అన్ని విధాలా నా సహకారం వుంటుంది" అంటూ హామీ యిచ్చి, పెద సన్యాసిరాజు మెళ్ళో దండ వేసి, కార్లో తన పక్కన కూర్చోబెట్టుకుని ఊరేగించాడు.

క్రిష్ణంరాజు చేతికింద వేటకుక్కల్లాంటి రౌడీ బలగం వుంది. ఆతని చరిత్ర అందరికీ తెలిసిందే. శత్రువు పక్కలో బల్లెమై దెబ్బతీసే అవకాశం ఎందుకివ్వాలన్న వుద్దేశంతో పెద సన్యాసిరాజు క్రిష్ణంరాజుతో కాస్త సన్నిహితంగా వుండటం మొదలెట్టేడు. వాళ్ళిళ మధ్య రాకపోకలు పెరిగేయి. చినసన్యాసికిది ఇష్టం లేకపోయినా అన్నగారిమీద గౌరవంతో వాళ్ళ మధ్య పెరుగుతున్న స్నేహాన్ని వారించలేకపోయేడు.

రెండేళ్ళ క్రితం, అంటె - అప్పటికి పెద సన్యాసిరాజు ప్రెసిడెంటయి ఆర్నెల్లయింది. క్రిష్ణంరాజు పుట్టిన రోజు సందర్భంగా ఊళ్ళో వాళ్ళందరికి తన తోటలో రాత్రి విందు ఏర్పాటు చేశాడు. తోటంతా ట్యూబులైట్లతోనూ, రంగు రంగుల బల్బులతోనూ వెలిగిపోతోంది. స్టేజి మీద బూతు పాటలతో సాటు కెబెరా డాన్సు గొలుసులేసి లాగినట్టు అందరినీ ఆకర్షిస్తోంది. అందుకు సాయం బీరూ, విస్కీ, నాటుసారా త్రివేణీసంగమమై తరగతుల వారీగా జనాన్ని ముంచెత్తింది. గొర్రెల్ని, కోళ్ళనీ కోసేవాళ్ళు కోస్తున్నారు. వొండేవాళ్లు వొండుతున్నారు. వొడ్డించేవాళ్ళు వొడ్డిస్తున్నారు. తాగేవాళ్ళు తాగుతున్నారు. తినేవాళ్ళు తింటున్నారు. ఎనిమిదింటికి ప్రారంభమైన విందు పదింటికి మంచి రక్తి కట్టింది. ఈలోగా నాలుగైదుసార్లు క్రిష్ణంరాజూ పెదసన్యాసిరాజూ కలిసి, తోటలోకొచ్చి ఊరు జనాల యోగక్షేమాలడగటం. వాగ్దానాలు చెయ్యటం. అంతస్తుల్నిబట్టి గౌరవ మర్యాదల్లో ముంచి తేల్చడం జరిగింది. క్రిష్ణంరాజుకి ప్రజల మీద ఇంత అభిమానం పుట్టుకొచ్చిందంటే, యిదంతా పెదసన్యాసిరాజుతో చేసిన స్నేహం మహిమే అన్నారందరూ.

ఆ పల్లె ప్రజలకదంతా భూలోక స్వర్గంలా వుంది. తోటలోకొచ్చినవాళ్ళే కాని తిరిగి వెళ్ళే వాళ్ళెవళ్ళూ కనబడలేదు. నేనూ చినసన్యాసిరాజూ కూడా అక్కడేవున్నాం. ఈ ఆడంబర ప్రదర్శన వెనకాల ఏదో రాజకీయ యెత్తుగడ వుంటుందనీ, పెదసన్యాసిరాజు ఏ యిరుకులోనూ పడకుండా జాగర్తగా వుండేటట్టు హెచ్చరించాలనీ నిర్ణయించుకున్నాం

రాత్రి పదకొండయింది. జనమంతా గొల్లుమన్నారు చేతుల్లో గ్లాసులు జారిపోయేయి. విస్తర్లముందు కూర్చున్నవాళ్లు విస్తర్లలో అడుగులేసి పరుగులెడుతున్నారు. కేజరాకు బ్రేకుపడింది. ఊర్లో యిళ్ళు కాలిపోతున్నట్టు, పిల్లా జల్లా ఒకళ్ళ నొకళ్ళు తొక్కుకుంటూ అందరూ తోట విడిచిపెట్టి పారిపోతున్నారు. క్షణంలో స్వర్గం నరకంగా మారింది. నేనూ చినసన్యాసీ జనంలో జొరబడి, ఏం జరిగిందని అడిగేం. పెదసన్యాసిరాజు భార్యా, క్రిష్ణంరాజు కారు డ్రయివరూ చచ్చి చెర్లో తేలుతున్నారని ఎవళ్ళో వొచ్చి చెప్పేరుట! పరిగెత్తేం. చూశాం. అది అక్షరాల నిజం.

పెదసన్యాసిరాజు కూడా పరుగుపరుగు నొచ్చి వొడ్డుకు లాగిన శవాల్ని చూసి మాటామంతీ లేకుండా కూలబడిపోయేడు. ఆరు వారాల నగలూ సింగారించుకుని హుందాగా విందుకు వెళ్ళిన పెదసన్యాసి భార్య వొంటిమీద నూలిపోగూ, చిన్నమెత్తు బంగారం, చివరకి కాలివేళ్ళ మట్టెలూ లేకుండా చచ్చి పడి వుంది. ఒంటినిండా దెబ్బలూ గాయాలూ. కారు డ్రయివరు తల బద్దలైంది. కృష్ణంరాజు కారు అద్దాలూ బద్దలై వున్నాయి.

పోలీసు దర్యాప్తు, కుక్కలూ, వేలిముద్రలూ, కాళ్ళ ముద్రలూ, జోళ్ళ ముద్రలూ తాలూకు తతంగం యధావిధిగా జరిగింది. ఊళ్ళో వాళ్ళంతా కారు చుట్టూ, చెరువుగట్టునా అడుసు తొక్కినట్టు తొక్కేసేరు. ఆ శవాల్ని వాసన చూపించిన ఓ కుక్క పెదసన్యాసి రాజింటికి మరో కుక్క కారు డ్రయివరింటికీ తీసుకెళ్లేయి. అంతకంటే అవి మాత్రం ఏం చేస్తాయి? విందునుంచి ఇంటికి తిరిగెళ్ళిపోవడానికి కృష్ణంరాజు మర్యాదగా పెదసన్యాసిరాజు భార్యని కార్లో పంపేడట! ఊరంతా తోటలోనే వుందని తెలిసిన ఏ దొంగలగుంపో చెరువుగట్టు రోడ్డు మీద కారుని అటకాయించి, అద్దాలు బద్దలుకొట్టి ఈ అఘాయిత్యం చేసి వుంటుందని కృష్ణంరాజు కంటతడిపెట్టేడు. అనుకున్నట్టుగానే పోలీసు దర్యాప్తు విఫలమైంది.

పెదసన్యాసిరాజుని పట్నం తీసుకెళ్ళేరు. పది రోజుల తర్వాత పిచ్చి సన్యాసిగా తిరిగి వొచ్చేడు. ఊరంతా గొల్లుమన్నారు. ఎందుకో తెలియని పెద సన్యాసి తనలో తనే నవ్వుకున్నాడు.

నెల తిరక్కుండా, కృష్ణంరాజు చెప్పుకింద మనిషే ఏకగ్రీవంగా, ప్రెసిడెంట్‌గా ఎన్నిక అయ్యేడు ఆ రోజున దండలేసుకుని క్రిష్ణంరాజూ, కొత్త ప్రెసిడెంటు కామయ్యా జీపులో ఊరేగుతూ సన్యాసిరాజు సోదరులింటి ముందు ఓ నిమిషం ఆగేరు. ఏం జరుగుతుందో తెలియని పెద సన్యాసి అరుగు మీద కూర్చుని తన గెడ్డం మీసాలూ తడుముకుంటూ, గాజు గుడ్లుతో చూస్తూ తన లోకంలో తనున్నాడు. చిన సన్యాసి తనవైపు గుర్రుగా చూడటం కనిపెట్టిన క్రిష్ణంరాజు ఠీవిగా జీపు దిగి, "ఏమిటో బ్రదర్! అనవసరంగా భయపడ్డావు కాని, నువ్వు నిలబడితే బాగుండేది" అన్నాడు.

క్రిష్ణంరాజు మొహంమీద 'థూ' అని ఉమ్మేసేడు చిన సన్యాసి.

"ఏరా రాస్కెల్, మీ అన్నకు పట్టిన గతే నీకూ పట్టాలని వుందా?" అన్నాడు క్రిష్ణంరాజు, కండువాతో మొహం తుడుచుకుంటూ.

వివేకం, విచక్షణా అంతరించిన ఆ క్షణంలో, పట్టరాని కోపంతో చిన సన్యాసి క్రిష్ణంరాజుమీదకురికి రెండు చేతులతోనూ పీక నులిమేస్తుండగా నేను లాగేశాను. లేకపోతే ఆ రోజే క్రిష్ణంరాజు చచ్చుండేవాడు.

క్రిష్ణంరాజు చిన సన్యాసిరాజు మీద కేసు పెట్టేడు. పబ్లిగ్గా జరిగిందానికి సాక్షులకు లోటు ఏముంటుంది? అరెస్టయిన సన్యాసికి జామీనివ్వకుండా చెయ్యాలని క్రిష్ణంరాజు శతవిధాల ప్రయత్నించేడు కాని, మా బావ కలగజేసుకుని మర్నాడే జామీను ఇప్పించేడు. కేసయ్యేవరకూ పెద సన్యాసీ, చిన సన్యాసీ, అతని భార్య పట్నంలో కాపరం పెట్టేరు.

చిన సన్యాసికి కూడా పిచ్చెక్కిందని, నేను కేశవగిరి వూళ్ళో వాళ్ళకి చెప్పగానే కంటతడిపెట్టనివాళ్ళు లేరు. కేసు విచారణ అయినట్లే ఎవరికీ తెలీనంత గప్‌చుప్‌గా విచారణయి పోయింది. రెండేళ్ళు జైలుశిక్ష పడింది. మతిభ్రమణ సూచనలున్నాయికనక మతిస్థిరం కుదిరే వరకూ మెంటల్ హాస్పిటల్లో పెట్టి, ట్రీట్‌మెంటిప్పించమని మేజిస్ట్రేట్ జడ్జిమెంట్ ఇచ్చేడు. క్రిష్ణంరాజూ, అతని అనుయాయులూ చంకలెగరేశారు.

మాపూరివాళ్ళందరూ 'పెదసన్యాసిరాజు, చినసన్యాసిరాజు భార్యా పట్నం నుంచి ఇక్కడికి రారా?' అని అడిగేరు. ఈ అవమానాన్ని భరించే స్థితిలో ఆమె లేదు. ఆమెసీ పిచ్చిసన్యాసిని రామన్న పేటలో వుంచి జాగర్తగా చూసుకోమని నా స్నేహితుడైన ఆ వూరు సర్పంచ్ ప్రభాకరానికి అప్పగించేనని వాళ్ళకి చెప్పేను. ఆ వార్త అలా అలా క్రిష్ణంరాజు వరకూ పాకగానే 'ఈ దెబ్బతో ఊరు పూరంతకీ బుద్దొస్తుం'దని మీసం మెలేసేట్ట!

*  *  *

నా కార్లో నేనూ, గవర్నమెంట్ కార్లో మా బావ, మెంటల్ హాస్పిటల్ సూపర్నెంటూ బయలుదేరి సరాసరి రామన్న పేటెళ్ళి, సర్పంచి ప్రభాకరా న్నెక్కించుకుని పోలీస్‌స్టేషన్ కెళ్ళేం. మా బావ కారు దిగడం చూసిన యాద్గిరి నిర్ఘాంతపోయేడు. అప్పుడే పోస్టుమార్టం అవడం, శవాన్ని కేశవగిరికి తీసుకు పోవడం అయిపోయింది. పంచనామా జరిపి, సన్యాసిమీద కేసు నమోదు చేసేడు ఇన్‌స్పెక్టర్. హత్యాయుధం అయిన గొడ్డలివి వేలిముద్రలు చెరిగిపోకుండా జాగ్రత్తగా పోలిథిన్ బేగ్‌లో భద్రం చేసి వుంచేడు.

కేసు దర్యాప్తు విషయంలో స్వయంగా డిఅయ్‌జీ వొచ్చేడని తెలిసి వూళ్ళో పెద్దలందరూ ఒక్కొక్కళ్ళే స్టేషన్ చుట్టూ మూగేరు. నేనూ మెంటల్ హాస్పిటల్ సూపర్నెంటూ మా బావా ఇన్‌స్పెక్టర్ యాద్గిరీ లాకప్‌లో వున్న సన్యాసిని చూశాం. మాకేసి బెదురుచూపులు చూసి గోడవైపు తిరిగి కూర్చున్నాడు. దగ్గరగా వెళ్ళి సన్యాసి బుజాలు పట్టుకుని మా బావ కుదిపి అతని మొహాన్ని తనవైపు తిప్పి చూశాడు. సన్యాసి ఏదో గొణుక్కుంటూ మళ్ళీ మొహం గోడ వైపుకు తిప్పేసుకున్నాడు.

"దెబ్బలు గట్టిగా తగిలినట్లున్నాయి. మనుషుల్ని చూస్తేనే బెదిరిపోతు న్నాడు" అన్నాడు మా బావ యాద్గిరికేసి తిరిగి.

"ఇంట్లోంచి ఇక్కడికి రావడానికి పేచీ పెట్టేడు. రెండు దెబ్బలేసి కొట్లో పడేశాం. పిచ్చోడు సార్! ఎప్పుడూ ఇలాగే ఇంట్లో కూడా ఓ మూల కూచునుంటాడంట సార్. ఎవరేనా వొస్తే అతని మరదలే సమాధానం చెబుద్దంట సార్!" అన్నాడు యాద్గిరి.

మెంటల్ హాస్పిటల్ సూపర్నెంట్ సన్యాసిని పరీక్షచేసి "హీ యీజ్ ఇనెస్టేట్ అఫ్ షాక్ అండ్ టెరర్. టెంపరేచరు కూడా వుంది. దెబ్బలు కూడా బాగా తగిలేయి. వెంటనే హాస్పిటల్‌లో చేర్చి సైకోథెరఫీ చెయ్యాలి" అన్నాడు.

‘‘గట్టి దెబ్బలేమంత తగల్లేదు సార్! అసలు ఆ కేశవగిరి నుంచి పది మంది రౌడీలొచ్చి స్టేషన్ మీదపడి యితన్ని చంపేస్తామంటూ కర్ర లేసుకొచ్చేరు సార్! నేను రివాల్వర్‌తో బెదిరించి లోపలికి రానివ్వలేదు. వూరువాళ్ళు కూడా ‘పిచ్చాణ్ణి కొట్టి చంపేటంతటి గొప్ప వస్తాదులా?’ అని చెప్పి వాళ్ళని వెళ్ళగొట్టేశారు సార్! సమయానికి నేను రాకపోతే చంపేద్దురు” అన్నాడు యాద్గిరి.

‘‘యూ హేవ్ డన్ యువర్ బెస్ట్. డోంట్‌వర్రీ. కేస్ బాగా హేండిల్ చేశావు. నీకు రివార్డ్ కూడా యిప్పిస్తాను ఇతన్నిక్కడే వుంచితే సిట్యువేషన్ ఇన్‌ఫ్లేమయ్యి, మళ్ళీ అల్లర్లు జరుగుతాయి” అన్నాడు మా బావ.

‘‘అవును సార్. వీళ్ళిద్దరు బ్రదర్స్ సార్! ఇతను పెద సన్యాసిరాజు. ఇతని తమ్ముడు చిన సన్యాసిరాజు రెండేళ్ళక్రితం ఈ క్రిష్ణంరాజుని గొంతు పిసికి చంపెయ్యబోయేడంట సార్! జైల్లో వున్నాడండి” అన్నాడు యాద్గిరి.

‘‘అవును, నాకు తెలుసు. వెంటనే రెండు పనులు జరగాలి. ఇతనికి తోడుంచి కాలకృత్యాలు తీర్చుకున్నాక స్నానం చేయించి వాళ్ళింటి నుంచి బట్టలు తెప్పించి ఇయ్యి. ఇతన్ని నా కూడా తీసుకెళ్ళి మేజిస్ట్రేటు దగ్గిర పర్మిషన్ తీసుకుని మెంటల్ హాస్పిటల్లో చేర్పించాలి. చిన సన్యాసిరాజు భార్య ఒక్కత్తే యిక్కడుండటం ప్రమాదం. ఏం జరిగినా జరగొచ్చు. ఆమె భర్త మెంటల్ పేషెంట్‌గానే జైలు శిక్షలో వున్నాడు. ఈమె కెవరైనా బంధువులుంటే సిటీకి చేర్చడం మంచిది” అన్నాడు బావ నాకేసి చూసి.

‘‘ఉన్నారున్నారు, నాకు బాగా తెలును. అభ్యంతరం లేకపోతే నేను తీసుకెళ్ళి ఈవిడ అక్కడుండే ఏర్పాటు చేస్తాను” అన్నాను, అతని అభిప్రాయం గ్రహించి.

‘‘వెరీగుడ్. వెంటనే తీసుకెళ్ళిపోవచ్చు. ఆవిడ దగ్గిర స్టేట్‌మెంట్ రికార్డ్ చెయ్యవల్సి వుంటుంది. ఆవిడ ఎక్కడుండేదీ వెంటనే తెలియచేస్తే.... బై దిబై... ఇతని దగ్గిరకాని ఆవిడ దగ్గిరకాని స్టేట్‌మెంట్లేమైనా తీసుకున్నావా?” అని అడిగేడు బావ యాద్గిరిని.

‘‘ఇంకా లేదు సార్! ఇతను పిచ్చోడు ఎంత కొట్టినా.... ఐమీన్....ఎంత చెప్పినా కాగితం కలం ముట్టుకోలేదండి! ఆవిడ మర్డర్ జరిగినప్పట్నుంచీ స్పృహ తప్పినట్టు పడివుందండి. .”

''దట్సాల్రయిట్- అసలు ఆ క్రిష్ణంరాజు కేశవగిరి నుంచి అర్ధరాత్రివేళ ఈ వూరెందుకొచ్చాడు?"

''ఇంకా తెలియదు సార్!"

''ఎలా వొచ్చేడు?"

''కార్లో వొచ్చి కారు సుందుమొగలో ఆపించి ఆయన నడిచి వొచ్చేడట సార్. మర్డర్ జరిగిం తరువాత డ్రయివ రొచ్చి చూసి కారు కేశవగిరి తీసుకు పోయేడు. మళ్ళీ అ కార్లోనే పొద్దున్న రౌడీలొచ్చి అల్లరి చేశారు. ఆ కార్లోనే శవాన్ని చంద్రాపురం మెడికలాఫీసరు చేత పరీక్ష చేయించి, పోస్ట్‌మార్టం రిపోర్టు తీసుకుని, శవాన్ని కేశవగిరిలో వాళ్ళ వాళ్ళ అప్పగించి గంటక్రితమే వొచ్చేను సార్!" అన్నాడు యాద్గిరి.

"ఆల్‌రైట్. సోఫార్ సోగుడ్. ఆ గొడ్డలి వున్న పోలిథీన్ సంచికూడా నా కార్లో పెట్టించు, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌కి పంపిస్తాను. వీళ్ళిద్దర్నీ ఎంత త్వరగా సిటీ పంపిచేస్తే అంత మంచిది. కమాన్, గెట్ బిజీ" అన్నాడు మా బావ.

మేము బయల్దేరే ముందు వూళ్ళో పెద్ద మనుషులందరూ మా బావని చుట్టుముట్టేరు. అందులో ఒకాయన "బాబూ! ఆ యమ్మ దేవతలాంటిది. ఇతనా పిచ్చోడు. ఎప్పుడూ యెవరి జోలికీ పోయెరుగడు. అలా యింట్లో కూసుంటాడు. రెండేళ్ళయిందాళ్ళీ వూరొచ్చి. ఆ క్రిష్ణంరాజు గురించి ఈ సుట్టుపక్కల గ్రామాలోళ్లు రకరకాల కతలు సెబుతారు. కేశవగిరిలో...." అంటూ ఏదో విన్నపం దండకంలా మొదలెట్టేడు.

"మంచి చెడ్డలు నిర్ణయించవల్సింది కోర్టు. ఇతని మీద యీగ వాలకుండా ముందు పిచ్చాసుపత్రిలో చేర్పిస్తాం. ఆవిడని జాగర్తగా వాళ్ళ వాళ్ళింటికి పంపుతాం" అన్నాడు మా బావ.

"అంతేబాబూ, ఆ పిచ్చోణ్ణి యింక కొట్టకుండా సూడండి. అన్నిటికీ ఆ బగమంతుడే వున్నాడు" అన్నాడు మరో పెద్దమనిషి.

*  *  *

మర్నాడు అన్ని వార్తాపత్రికలూ క్రిష్ణంరాజును పిచ్చి సన్యాసిరాజు దారుణంగా హత్య చేసినట్టూ, డిఅయిజి ప్రత్యేకశ్రద్ధ తీసుకుని కేసు దర్యాప్తు చేస్తు నట్టూ ప్రచురించేయి. ముద్దాయి మానసిక స్థితి సరిగ్గా లేనందువల్ల కేసు మూడు సార్లు వాయిదా పడింది. ఈలోగా జైలునుంచి శిక్ష పూర్తయిన చినసన్యాసిరాజు

విడుదలైనట్టూ, అతని మానసికస్థితి మెరుగుపడినట్టూ పత్రికల్లో పడుతూ వచ్చింది. కేసు విచారణకి రాకముందే పెద సన్యాసిరాజు మరణించేడు. ఆఖరి క్షణాల్లో నేనూ చిన సన్యాసిరాజు ప్రక్కనే వున్నాం. ఆ విధంగా క్రిష్ణంరాజు హత్యకేసు ముగిసింది.

* * *

నేనూ మా బావా సన్యాసిని వెంటబెట్టుకుని రామన్నపేట నుంచి సిటీ మెంటల్ హాస్పిటల్ కొచ్చిం తర్వాత సూపరెన్టెంట్ రూంలో ఏకాంతంగా కూర్చుని అసలు క్రిష్ణంరాజు అర్ధరాత్రిపూట వాళ్ళింటి కెందుకొచ్చేడని అడిగేము.

"రాత్రి పదకొండు దాటింది. తలుపు చప్పుడయింది. నే నొచ్చి మండువాలో మంచం మీద పడుకున్నాక మా అవిడెళ్ళి తలుపు తీసింది. క్రిష్ణంరాజు నెమ్మదిగా తలుపు తీసుకుని లోపలికొచ్చి తలుపు దగ్గరగా వేశాడు. నేను నిద్రపోతున్నట్టు నటిస్తూ ఓకంట కనిపెడుతున్నాను.

"మీరా ఏం పనిమీదొచ్చారు?" అని అడిగింది మా అవిడ.

''నీతో కొంచెం మాట్లాడాలనొచ్చేను. నామీద మీ అందరికీ కోపం వుండటం సహజమే. మీ ఆయన తొందరపడ్డాడు. నేనూ తొందరపడి పోలీసులకి రిపోర్టిచ్చేను. జైలుకెళ్ళేడు. ఇప్పుడతని ఆరోగ్యస్థితి ఏమీ బాగాలేదనీ, అట్టే రోజులు బతకడనీ, బతికినా పిచ్చి కుదరదనీ అందరికీ తెలిసింది. ఓ మూల ఇలా ఈ పిచ్చి బావగారితోనూ, అటు పిచ్చిమొగుడు జైల్లో వుంటే నువ్వేం సుఖపడతావు?'' అన్నాడు క్రిష్ణంరాజు.

''అయితే, ఏం చెయ్యమంటారు?'' అని అడిగింది మా అవిడ.

''ఈ అజ్ఞాత వాసానికి స్వస్తిచెప్పి కేశవగిరొచ్చెయ్యి. వాళ్ళిద్దరికీ బతికున్నన్నాళ్ళూ ఏ లోటూరాకుండా నేనన్ని ఏర్పాట్లూ చేస్తాను. నీకో సెపరేట్ బంగళా నౌకర్లూ చేకర్లూ ఏర్పాటుచేసి నిన్ను పువ్వుల్లోపెట్టి పూజిస్తాను. నిండైన నీ జీవితాన్ని పిచ్చాళ్ళపాలు చేసిన నా నేరానికిది నిష్కృతి అనుకుంటాను. పదిమంది మీ కుటుంబాన్ని నాశనం చేశాననుకోడం నేను సహించలేను'' అన్నాడు దీనంగా మొహంపెట్టి.

''ఇది చెప్పడానికేనా ఇంత అర్ధరాత్రి వేళొచ్చేరు?'' అంది మా అవిడ.

''స్వయంగా మాట్లాడి నీ మనస్సు తెలుసుకుందామనొచ్చేను. పగలైతే పదిమందీ పది రకాలుగా అనుకుంటారు. ఈ మాత్రం హృదయం విప్పి మాట్లాడే అవకాశం వుండదని ఇప్పుడొచ్చేను'' అన్నాడు.

''ఇంతవరకూ మా కుటుంబాన్ని వుద్ధరించిందిచాలు. ఇంక వొచ్చిందారిని దయచెయ్యి" అంది మా ఆవిడ తలుపు తియ్యడానికి వెడుతూ.

''ఈ తొందరే మీ కుటుంబాన్ని నాశనం చేసింది. ఒక్క విషయం గుర్తుంచుకో- మీ ఆయన తిరిగొచ్చినా పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరినా బతకడు. నా బొందిలో ప్రాణముండగా నువ్వు నీ మొగుడితో కాపరం చెయ్యలేవు'' అన్నాడు, చెయ్యి పట్టుకు లాగుతూ. మా ఆవిడ చెయ్యి విదిలించుకుంది మళ్ళీ పట్టుకోబోయేడు.

''పో బయటికి, లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను'' అంటూ ఒక్క అంగలో గోడకు అనించివున్న గొడ్డలి అందుకుంది.

''భేష్! పౌరుషంలో మీ ఆయనకి తీసిపోవు. మీ యిద్దరూ జైల్లో కాపరం పెట్టండి'' అంటూ చటుక్కున మా ఆవిణ్ణి వాటేసుకున్నాడు. మా ఆవిడచేతిలో గొడ్డలి కిందపడింది. నేను ఒక్క ఉదుటన వెళ్ళి వెనకనుంచి వాడిపీకకి నా చేత్తో లంకెవేసి ఒక్కలాగు లాగేను. మా ఆవిణ్ణి వొదిలేసి, కాలితో గొడ్డలిని దగ్గరికి లాక్కోడానికి ప్రయత్నించేడు. వాణ్ణి గోడవైపుకు లాగి మా ఆవిడతో "ఆ గొడ్డలందుకుని ఇలా ఇయ్యి" అన్నాను. వాడు నా స్వరం ఆనవాలుపట్టి "నువ్వా రాస్కెల్?" అన్నాడు. వాణ్ణి గోడవైపు అణిచిపెట్టి, నేను వొంగి గొడ్డలి అందుకుని, వాణ్ణి వొదిలేసి గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాను. "ఎంత మోసం! నీ బదులు మీ అన్నను జైలుకు పంపి...." అదే వాడి ఆఖరిమాట. గుమ్మంలో వున్న నన్ను తప్పించుకు పారిపోతుంటే మళ్ళీ మెడ పట్టుకుని, బరబరా మెట్లమీదనుంచి బయటికి లాగి కిందపడేసి "ఇది మా వొదిన్ని చంపినందుకు; ఇది మా అన్నయ్య బతుకు నాశనం చేసినందుకు" అని రెండే రెండు వేట్లు వేశాను. మొండెం తలా వేరయ్యాయి" అన్నాడు చిన సన్యాసిరాజు.

ఆ రోజున క్రిష్ణంరాజు బతికి బయటపడితే-మైగాడ్! స్నేహితుడికోసం మా బావ ఎంత రిస్క్ తీసుకున్నాడో తల్చుకున్నప్పుడల్లా యిప్పటికి గుండెలు దడదడలాడతాయి.

*

('ఆంధ్రభూమి' సచిత్రవార పత్రిక, 25-11-'82)